క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తం



మదనాపురం: సైబర్ నేరాల గురించి ప్రజల్లో చైతన్యం చేయడానికి మంగళవారం గురుకుల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ రాంనారాయణ మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెల్‌ఫోన్ ద్వారా వస్తున్న మేసేజ్‌లను నమ్మవద్దని సూచించారు. ఎవైనా అనుమానం వస్తే స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

క్షయ నివారణపై అవగాహన



పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లిలో పాన్‌గల్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నివారణపై మంగళవారం అవగాహన కల్పించి, అనుమానితుల నుంచి తెమడను సేకరించినట్లు ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసులు తెలిపారు. దీర్ఘకాలికంగా దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి వంటి లక్షణాలు ఉంటే ఆశా కార్యకర్తకు తెలియపర్చి తెమడ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనుమానితుల నుంచి సేకరించిన తెమడను జిల్లా టీబీ యూనిట్‌కు పంపించామని తెలపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం కళావతి, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

'దళితబంధు' నిధులు విడుదల చేయాలి



వీపనగండ్ల: దళితబంధు పథకానికి కేటాయించిన నిధులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి మండల కేంద్రం నుంచి తెలంగాణ దండోరా నాయకులు బయలుదేరి వెళ్లారు. దళితులకు అమలు చేస్తామన్న దళితబంధు పథకానికి కేటాయించిన రూ.1,700 కోట్లు తక్షణం విడుదల చేసి లబ్ధిదారులను వెంటనే గుర్తించాలని తెలంగాణ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల రాము డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగరాజు, స్వామి, రాజశేఖర్, రామకృష్ణ, సహదేవుడు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని జగత్‌పల్లి శివారులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ అఫ్జల్ పరిశీలించారు. ఉపాధి హామీ పనుల్లో అసత్వం చేయొద్దని, పనులను పకడ్బందీగా నిర్వహించాలని టీఏ, ఎఫ్‌ఏలకు సూచించారు. అలాగే కూలీ పనులు జరుగుతున్న ప్రదేశంలో కూలీలకు సరైన వసతులను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ శివారులో గల కాలువ పూడికతీత పనులను దగ్గరుండి పరిశీలించడంతో పాటు మస్టర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతం చేసేందుకు కూలీల సంఖ్య పెంచాలని, ఉపాధి హామీ ద్వారా పనుల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి కూలీకి పని కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చేపల పెంపకంలో యాజమాన్య పద్ధతులు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని మత్స్య కళాశాలలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన రైతులకు మంగళవారం శాస్త్రీయ పద్ధతిలో చేపల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ డాక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనను ఉపయోగించుకోవాలని మత్స్యకారులందరికీ తెలియజేశారు. అలాగే చేపలు తినడం వల్ల చేకూరే ఆరోగ్య ప్రయోజనాలు, చేపల పెంపకానికి అనువైన జాతులు, ప్రాంతాలు ఎంపిక, చెరువు నిర్మాణం, నీటి నాణ్యత, నిర్వహణ, మార్కెటింగ్ ఎగుమతులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మేకల సుమతి, ప్రొఫెసర్లు అనూష, డాక్టర్ దేవానంద్, భానుప్రకాష్, ముత్తప్ప ఖవీ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



పనుల్లో నాణ్యత లోపించొద్దు

- రూ.4.10 కోట్లతో అభివృద్ధి పనులు
- మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ



దొండాయిపల్లిలో..



అమరచింతలో సీసీ పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ

అమరచింత: పట్టణంలో సీసీ రహదారులు, డ్రెయినేజీ నిర్మాణాలతో పాటు రెండు పార్కుల ఏర్పాటుకు రూ.4.10కోట్లతో పనులను చేపడుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ తెలిపారు. మున్సిపాలిటీలో వారం రోజుల నుంచి చేపడుతున్న సీసీ రహదారి పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్, ఏఈతో కలిసి పరిశీలించారు. ఈమేరకు చైర్‌పర్సన్ మంగమ్మ మాట్లాడుతూ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సహకారంతో పట్టణంలో పలు అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం ఆయా వార్డుల్లోని ప్రధాన రహదారులకు సీసీ చేస్తున్నామన్నారు. ఎస్సీ కాలనీలో రూ.50 లక్షలతో సీసీ రహదారులు, డ్రెయినేజీలు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. కొన్ని నెలలుగా పట్టణంలో ఎక్కడెక్కడ సీసీ రహదారులు అవసరం అన్న విషయాలను ఆయా వార్డు కౌన్సిలర్లతో తెలుసుకోవడం, వాటి అంచనా వ్యయాలను ఏఈతో చర్చించి రూ.4.10కోట్లు మంజూరు చేయించారు. పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకోవడానికి మున్సిపల్ పాలక వర్గం కృతనిశ్చయంతో ఉందన్నారు. ముందు తరాలకు ఉపయోగపడేలా రహదారులు నాణ్యతతో నిర్మించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశించామన్నారు. ఆయా వార్డు ప్రజలు, యువకులు ముందుండి సీసీ రహదారులను నిర్మించుకోవడంలో సహకారం అందించాలని కోరారు.

ఆరోపణలు సరికావు

సీసీ రహదారుల నిర్మాణాల్లో నాణ్యత లోపించిందని, అధికారులు, ప్రజాప్రతినిదుల పర్యవేక్షణ లేదని ఆరోపణలు చేయడం సరికాదని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. పట్టణాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తుంటే సహకరించాలే తప్పా అవినీతి జరుగుతుందని, నాణ్యత లేని రహదారులు నిర్మిస్తున్నారని చెప్పడం సరికాదన్నారు. మున్సిపల్ అభివృద్ధిలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా పట్టణ ప్రజలందరూ హర్షించే పనులను చేపట్టడానికి నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా, ఏఈ ధర్మారాజు, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ నాగభూషణంగౌడ్ పాల్గొన్నారు.

దొండాయిపల్లిలో..

పాన్‌గల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రత్యేక నిధులు (ఎస్‌డీఎఫ్) ద్వారా నిర్మిస్తున్న సీసీ రోడ్లను నిబంధనల మేరకు నాణ్యతగా నిర్మించాలని మండల ప్రత్యేకాధికారి సురేష్ అన్నారు. మంగళవారం మండలంలోని బండపల్లి, దొండాయిపల్లి గ్రామాల్లో సీసీ నిర్మాణాలు, ఫార్మేషన్ రోడ్ల నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. నిర్మాణం పనుల్లో నిబంధనలు విస్మరించినా, నాణ్యత లోపించినా బిల్లుల చెల్లింపును నిలిపివేస్తామని హెచ్చరించారు. కొత్తపేటలో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించి అందరూ కంటి పరీక్షలు చేసేకునేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, పీఆర్ ఏఈ సత్తయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ సేవలు చిరస్మరణీయం

అమరచింత: కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించి, విద్యను కాషాయీకరణ చేస్తుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వెంకటేష్ అన్నారు. పట్టణంలోని జీఎస్ భవనంలో మంగళవారం భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో ముద్రించిన పుస్తకాన్ని విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో భగత్‌సింగ్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అలాంటి మహానుభావుల జీవిత చరిత్రను పాఠ్యంశాలలో పొందుపర్చాల్సిన అవసరం అందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎన్ రమేష్, నరసింహ, రాఘవ, రవి, చిన్న విష్ణు, నాగరాజు, తిరుమలేష్, యుగందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: బ్రిటీష్ సామ్రాజ్యవాదులను గడగడలాడించిన షహీద్ భగత్‌సింగ్ గొప్ప దేశభక్తుడని, ఆయన ఆశయాలతో విద్యార్థులు ముందుకెళ్లాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాఘవ అన్నారు. మంగళవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో రెడ్ బుక్ డే కార్యక్రమాన్ని నిర్వహించి స్వాతంత్ర్య ఉద్యమంలో భగత్‌సింగ్ వీరోచిత పోరాటాల గురించి వివరించారు. కార్యక్రమంలో భాను, వినయ్, రోహిత్, భానుప్రకాష్, అరవింద్ పాల్గొన్నారు.



మదనాపురంలో భగత్ సింగ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

'విప్లవ కెరటం' పుస్తకావిష్కరణ

మదనాపురం: రెడ్ బుక్ డే సందర్భంగా మండల కేంద్రంలో భారత విప్లవ కెరటం భగత్‌సింగ్ పుస్తకాన్ని మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. సీపీఎం మండల కార్యదర్శి రాజు మాట్లాడుతూ పార్టీ దేశవ్యాప్తంగా ఈరోజు కారల్ మార్క్స్ రాసిన పార్టీ ప్రణాళిక పుస్తకాన్ని భారత స్వాతంత్ర ఉద్యమంలో బ్రిటిష్ వారికి వెన్నులో వణుకు పుట్టించిన భగత్‌సింగ్ లాంటి మహనీయుల పుస్తకాలను ఆవిష్కరిస్తామని తెలిపారు. ఈ పుస్తకాల ద్వారా మహనీయుల వీరగాథలు, కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక నిర్మాణం కర్తవ్యాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వెంకట్రాములు, వెంకటేష్, చెన్నయ్య పాల్గొన్నారు.

రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలి

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లిలో చేపల వేటకు వెళ్లి వలలో చిక్కుకొని మృత్యువాత పడిన బాబు కుటుంబానికి ప్రభుత్వపరంగా రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించి ఆదుకోవాలని సర్పంచ్ రేణుమ్మ, ఉప సర్పంచ్ బాలస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం వారు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేపల వేట ప్రమాదమైన వృత్తి, అని ఈ వృత్తిలో అనేక మంది మత్స్యకారులు మృత్యువాత పడుతుండటంతో ఆయా కుటుంబాలు ఇబ్బందుల పాలవుతున్నాయన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వపరంగా ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



వీపనగండ్ల: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు పనిచేస్తున్న తెలంగాణ యూటీఎఫ్ బలపరిచిన అభ్యర్థి పాపన్నగారి మాణిక్యం రెడ్డిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవిప్రసాద్‌గౌడ్, కృష్ణయ్య అన్నారు. మండల కేంద్రంతో పాటు సంగినేనిపల్లి కేజీబీవీ పాఠశాలల్లో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాణిక్యంరెడ్డి గెలుపుతో ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం అయ్యే మార్గం సులువవుతుందని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, బాలీశ్వర్, కృష్ణ, శరత్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

దివ్య ఖురాన్ ప్రపంచ మానవాళికి మార్గదర్శకం

అత్మకూర్: పట్టణంలోని మదర్సా ఇమాదుల్ ఉలూం (అరబ్బీపాఠశాల) 22వ వార్షికోత్సవం మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈసందర్భంగా మహ్మద్ ప్రవక్త దివ్య సూక్తులను తెలంగాణ, ఆంధ్ర అరబ్బిక్ స్కూల్స్ అధ్యక్షుడు మౌలానా జమాలుర్ రహ్మాన్, మౌలాన అహ్మద్‌వమీజ్ సాహెబ్, మౌలానా జుబేర్‌అహ్మద్‌ఖాన్, ప్రముఖ మౌలానాలు, ప్రసంగీకులు దైవ సందేశమిచ్చారు. దివ్యఖురాన్ ప్రపంచ మానవాళికి మార్గదర్శకమని, ప్రతి ముస్లిం ఖురాన్ పఠనం చేయాలని సూచించారు. ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహువలై వసల్లం సూక్తులను పాటించాలని తల్లిదండ్రులను గౌరవించాలని, ప్రతి నిత్యం ఐదు పూటలు నమాజ్, దాన, ధర్మాలు చేయడం, ప్రతి ఒక్కరితో గౌరవపూర్వకంగా మెలగాలని అన్నారు. అనంతరం ఇక్కడ దివ్య ఖురాన్ పఠనం పూర్తి చేసిన విద్యార్థులకు సన్మానం నిర్వహించి ప్రపంచ శాంతి కోరుతూ ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హఫీజ్ జియాఉర్ రహ్మాన్, హెడ్‌మాస్టర్ హాఫీస్ రఫియొద్దీన్ ముస్లింలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మౌలానాలు

నేటి నుంచి విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని అల్వాలలో నూతనంగా నిర్మించిన కోట మైసమ్మ ఆలయంలో బుధవారం నుంచి మైసమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని గ్రామ పెద్దలు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ శివారులో దాతల సహకారంతో నూతనంగా నిర్మించుకున్న కోట మైసమ్మ ఆలయం పనులు పూర్తి కావడంతో అందరి సహకారంతో వేద పండితులచే ప్రత్యేక పూజల అనంతరం విగ్రహాల ప్రతిష్ఠిస్తారని తెలిపారు. ఈనెల 24వరకు పూజా కార్యక్రమాలు ఉంటాయని, గ్రామస్తులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

ఆత్మకూర్: పట్టణంలోని వికాస్ జూనియర్, డిగ్రీ, ప్రతిభ పారా మెడికల్ కళాశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు రక్తదానం ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్‌కలాంపాష ఆధ్వర్యంలో సభత్వాల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాజేందర్‌కుమార్, దైవాదీనం, బషీర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం ఏర్పాటు

పాన్‌గల్: కలెక్టర్ ఆదేశానుసారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించే రక్తదాన శిబిరంలో ఎక్కువ మంది పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉద్యోగులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.



ఆత్మకూర్‌లో సభ్యత్వాలు అందిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

'పాడి' అభివృద్ధికే పశువైద్య శిబిరాలు



అజ్జకొల్లులో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ కృష్ణయ్య

మదనాపురం: మండలంలోని అజ్జకొల్లులో పశుసంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పశువులలో గర్భకోశ వ్యాధులు నివారణ చికిత్స శిబిరాన్ని మంగళవారం జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని తమ పశువులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా కాపాడుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లలకు పౌష్టికాహారం, గుడ్లు, భోజనం సరిగా అందిస్తున్నారా అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌కుమార్, సర్పంచ్ బ్రహ్మమ్మ, ఎంపీటీసీ రాములు, సింగిల్ విండో డైరెక్టర్ నరసింహులు, మండల ఉపాధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు శాంతమూర్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృషభరాజాల యజమానికి సన్మానం



గోపాల కృష్ణయాదవ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

చిన్నంబావి: శివరాత్రి మహాపర్వదినాన్ని పురస్కరించుకుని సోమశిలలో సీనియర్ అంతరాష్ట్ర వృషభరాజుల బండలాగుడు పోటీలో మండలంలోని పెద్దదగడకు చెందిన మేకల గోపాలకృష్ణయాదవ్ ఎద్దులు విజయం సాధించాయి. వీరి ఎద్దులు అంతర్ రాష్ట్రంలో వివిధ పోటీల్లో విజయం సాధిస్తుండడంతో వృషభ రాజుల యజమానికి గ్రామస్తులు సన్మానం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామానికి పేరు తెస్తుండడంతో గోపాలకృష్ణయాదవ్‌ను సన్మానించుకోవడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ఈ ఎద్దులను నడిపిస్తున్న సారథులను ప్రజలు సన్మానించారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారి పద్మగౌడ్, డైరెక్టర్ నరసింహ, రమేశ్, నాగరాజు, రజినీకాంత్ రావు, శివగౌడ్, లక్ష్మణ్, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ శంభో శంకర



స్వామివారి పల్లకిసేవలో పాల్గొన్న చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, భక్తులు

ఆత్మకూర్: పట్టణ శివారులోని చెరవులో వెలసిన స్వయంభూ పరమేశ్వరస్వామి జాతరలో భాగంగా మంగళవారం భక్తిశ్రద్ధలతో రథోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి ఉత్సవమూర్తి విగ్రహాలను ఆలయంలోని శివలింగంపై అలంకరించారు. వందలాది మంది భక్తులు బక్షాలు, పచ్చి పులుసు, అన్నాన్ని స్వామి వారికి నైవేద్యంగా సమర్పించి దాసంగాలు పెట్టారు. అనంతరం ప్రముఖ పూజారులు కర్ణసయ్య ఆధ్వర్యంలో ఎంపీపీ బంగారుశ్రీను, మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, విండో అధ్యక్షుడు గాడికృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, జాతర కమిటీ కన్వీనర్ రవికుమార్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు చెన్నయ్య, మండ్లరామకృష్ణ, పోశన్న, అశ్విన్‌కుమార్, మహేశ్వరి, నాగలక్ష్మి, యాదమ్మ, తబస్సూంలు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాత్రి వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మొదలుకొని పట్టణంలోని పుర వీధుల గుండా స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం పల్లకీసేవను ఆలయానికి చేర్చి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి రథోత్సవంపై విగ్రహాలు ఉంచి రథోత్సవాన్ని నిర్వహించారు.

నేటి నుంచి నట్టల నివారణ మందుల పంపిణీ

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రంతో పాటు మండలంలోని పామిరెడ్డిపల్లిలో బుధవారం నుంచి గొర్రెలు, మేకలకు నట్టల శివారణ మందులు పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తున్నామని మండల పశువైద్యాధికారి అంజనేయులు, జేవీఓ జగదీష్ తెలిపారు. గురువారం అల్వాల, చిన్నమందడిలో, శుక్రవారం మనిగిల్ల, జంగమాయపల్లిలో, శనివారం జగత్‌పల్లి, బలిజపల్లిలో, 27న మద్దిగట్ల, దొడగుంటపల్లిలో, 28న మోజర్ల, గట్టుఖానాపూర్‌లో, మార్చి 1న వీరాయిపల్లి, వెల్టూర్‌లో కార్యక్రమం కొనసాగిస్తామని వారు తెలిపారు. ఈ అవకాశాన్ని కాపరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అమరచింత: మండలంలోని ఆయా గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను బుధవారం నుంచి పంపిణీ చేస్తున్నామని పశు వైద్యాధికారి డాక్టర్ రమేష్ తెలిపారు. ఈనెల 22 నుంచి 28 వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 22న మిట్టనందిమళ్ల, చింతరెడ్డిపల్లి, ఈర్లదిన్నెలో, 23న కిష్టంపల్లి, నందిమళ్లలో, 24 ఛంద్రగఢ్, మస్తీపురం, 25 న ధర్మాపురం, నాగల్‌కడ్మూర్, 27 న కొంకన్‌వానిపల్లి, పాంరెడ్డిపల్లి, 28 న సింగంపేట, అమరచింత, చంద్రనాయక్‌తండాలో నట్టల నివారణ మందులను పంపిణీ చేస్తున్నామని, ప్రతి రైతు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతి పల్లెకు తపాలా సేవలు

పెబ్బేరు: జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలకు తపాల కార్యాలయ డాక్ సేవలు అందిస్తున్నట్లు మంగళవారం జిల్లా సబ్ డివిజన్ అధికారి అభిన్‌శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాల శాఖ ద్వారా ప్రజలకు అన్నిరకాల ఖాతాలు, పోస్ట్ ఆఫీస్ సేవింగ్, బ్యాంక్ ఖాతా, రికవరింగ్, డిపాజిట్లు, టర్మ్ డిపాజిట్లు, ఇన్సూరెన్స్ సర్వీసులు అందిస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ఈ నెల 24న వనపర్తి జిల్లాలో అన్ని గ్రామాల తపాల కార్యాలయంలో ఖాతాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని, ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది, ఓవర్సీయర్లు రాంరెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అభిన్‌శర్మ

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు: ఎమ్మెల్యే

కొల్లాపూర్ రూరల్: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం వద్దని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అధికారులను హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని చుకాయపల్లిలో అయన మీ కోసం-మీ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. డ్రెయినేజీ, కరెంట్, నీటి, ఇళ్ల స్థలాలు వంటి సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు, ప్రజా సమస్య లు పరిష్కరించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'కంటివెలుగు'ను వినియోగించుకోండి

వీపనగండ్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఇంద్రకంటి వెంకటేశ్ అన్నారు. సంగినేనిపల్లిలో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలను అందజేయనున్నట్లు ఎంపీడీఓ కతలప్ప తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మౌలాలి, మండల వైద్యాధికారి వంశీకృష్ణ, అదనపు వైద్యులు శ్వేత, పంచాయతీ కార్యదర్శి శ్యాం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, కుర్మయ్య, రాంచంద్రయ్యగౌడ్, వేణుమాదవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ కాంతి అన్నారు. ఆమె మంగళవారం శ్రీరంగాపురం మండలంలోని జానంపేట పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమం పరిశీలించారు. గ్రామంలో 153 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, వారిలో 10 మందికి రీడింగ్ అద్దాలను అందించగా.. 11 మందికి అవసరమైన అద్దాల తయారీకి పంపిచామన్నారు. 11 మందికి ఆపరేషన్ అవసరం ఉన్న వారిగా గుర్తించామని మండల వైద్యాధికారి రాముడు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఎంపీఓ రాజు, వైద్య సిబ్బంది పవన్‌కుమార్, ప్రియాంక, కార్యదర్శి కార్తీక్, సూపర్‌వైజర్ సత్యమ్మ, ఏఎన్ఎం అనురాధ, భాగ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు సంగీత పాల్గొన్నారు.

295మందికి..

ఖిల్లాఘనపురం: మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగవారం మొత్తం 295 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ సౌజన్యలత తెలిపారు. ఖిల్లాఘనపురం పీహెచ్‌సీ పరిధిలోని షాపురంలో 146 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా ముగ్గురికి అద్దాలు పంపిణీ చేశారు. అదేవిధంగా 5 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. కమాలోద్దీన్‌పూర్ పీహెచ్‌సీ పరిధిలోని తిర్మలాయపల్లిలో మొత్తం 149 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా ఐదుగురికి కంటి అద్దాలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ రాంచందర్‌రెడ్డి, మక్బూల్ పాష తదితరులు పాల్గొన్నారు.



తిర్మలాయపల్లిలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు



జానంపేటలో..